మామ వచ్చాడు.. చేసి చూపించాడు



- నాడు పని, నేడు బడి వైపు చూస్తున్న చిన్నారులు
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారీ బడులు
- జగనన్న ప్రభుత్వంలో విద్యా వ్యవస్థలో అనూహ్యమైన మార్పులు
- చదువుపై పెరిగిన ఆసక్తి

జే.పంగులూరు:

జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలే మారిపోయాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మారాయి. గత ప్రభుత్వంలో ప్రభుత్వ హయాంలో శిథిలావస్థకు చేరిన పాఠశాలలు నేడు నూతన భవంతులు, ప్రహరీలు, డిజిటల్ క్లాసు రూములు, విద్యావిధానంలో పెనుమార్పులతో సర్కారి బడులు విద్యారంగంలో తను ముద్ర వేసుకుంటున్నాయి. పేద విద్యార్థుల తలరాతలు మారస్తోంది జగనన్న సర్కార్. పాఠశాలలు ఎటు వైపు చూసిన కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేల ఉన్నాయి. మొన్నటి వరకు విద్యారంగాన్ని ప్రతిపక్షాలు ఎద్దేవా చేశాయి. నేడు విద్యార్థులు సాధిస్తున్న సంచలన ఫలితాలను చూసి అటు కార్పొరేట్ పాఠశాలలు, ఇటు ప్రతిపక్షాలకు గుబులు పట్టుకుంది. గత నాలుగు సంవత్సరాలుగా గణనీయంగా కార్పొరేట్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది.

మండలంలోని 21 గ్రామాలకు గాను 31 ప్రాథమిక పాఠశాలలు, 7 ప్రాథమికోన్నత పాఠశాలలు, 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో మొత్తం 44 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మొదటి విడతగా 24 పాఠశాలలకు గాను రూ. 3.94 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించారు. రెండో విడత ప్రస్తుతం జరుగుతున్న పనులకుగాను 21 పాఠశాలలకు గాను రూ 2.11 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నారు.

నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధి..



రేణిగంగవరం పాఠశాలలో అభివృద్ధి ఇలా..



కొండమంజులూరు పాఠశాల వరండా..

పై ఫొటోల్లో కనబడుతున్న పాఠశాలలు కొండమంజులూరు, రేణిగంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు. గతంలో వసతులు లేమితో కొట్టుమిట్టాడుతుండేది. గత ప్రభుత్వం కార్పొరేట్ సేవలో తరించడంతో ప్రభుత్వ పాఠశాలలను గాలికొదిలేసింది. ఫలితంగా పేద ప్రజల పిల్లలు చదువుకు దూరమయ్యారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చాక ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా మార్చి వేశారు. నాడు నేడు పథకం కింద ఈ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల తరహా తిర్చిదిద్దారు. నాడు–నేడు కింద ఈపాఠశాలలు రూ. 43 లక్షలు మంజూరు అయ్యాయి. దీని ద్వారా రూ. 20 లక్షలతో 12 టాయిలెట్లు, రూ. 3 లక్షలతో 10 తరగతి గదులకు విద్యుత్ పరఫరా, పాఠశాల ఆవరణం ముందు పార్కింగ్, టైల్స్, అనేక మరమ్మతులు పనులు చేయడంతో పాఠశాల ఎంతో అహ్లాదకరంగా మారింది. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగ కరంగా ఉన్నాయని పాఠశాల హెచ్ఎం గోగుల వీరాంజినేయులు సంతోషం వ్యక్తం చేశారు.



హెచ్ ఎం వీరాంజినేయులు

పౌష్టికాహారంతో విద్యార్థుల్లో మెరుగైన ఆరోగ్యం



రితీష్

ఈ ఫొటోలో నవ్వుతూ కనబడుతున్న విద్యార్థి పేరు తలమాల రితీష్. బూదవాడలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువతున్నాడు. గతంలో ఇంటి నుంచి ఆహారం తెచ్చుకునేవాడు. జగనన్న వచ్చాక మంచి పౌష్టికాహారం పెడుతున్నాడని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. నాలుగేళ్లుగా పాఠశాలలో క్రమం తప్పకుండా మంచి శుచి, రుచికరమైన ఆహారం పెడుతున్నారని చిరునవ్వుతో చెప్తున్నాడు. ఇంటి వద్ద తినే దాని కంటే ఇక్కడే చాలా రుచికరంగా ఉంది.. భోజనంతో పాటు మాకు స్నాక్స్ కూడా అందిస్తున్నారని ఆనందంతో చెప్పాడు.

అమ్మఒడి పథకంతో తల్లులకు కొండంత ఆసరా..

ఈ ఫొటోలో పింఛన్ తీసుకుంటున్న అమె పేరు కూరాకు అంజలి. బూదవాడ గ్రామంలో నివశిస్తోంది. భర్త చనిపోవడంతో కూలినాలి చేసుకొని కూతురును పోషిస్తోంది. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో నైరాశ్యంలో మునిగింది. ఈ పరిస్థితుల్లో సీఎం జగన్ మెహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన అమ్మఒడి పథకంతో కష్టం తీరింది. అమ్మఒడి రూ.15 వేల డబ్బులతో అమ్మాయికి కావాల్సిన అవసరాలు తీర్చానని సంతోషం వ్యక్తం చేసింది. అంతేకాక వితంతు పింఛన్ కూడా ఒకటో తారీఖున వస్తుండటంతో ధైర్యంగా జీవితం గడుపుతున్నామని ఆనందభాష్పాలతో సమాధానం ఇచ్చింది. పేదలకు ఇంత కన్నా మంచి చేసే ప్రభుత్వం ఎక్కడ ఉంటుందని భరోసాతో చెప్పింది.



పింఛన్ తీసుకుంటున్న కూరాకు అంజలి

బైజూస్ కంటెంట్‌తో సరికొత్త విప్లవం..

కింది ఫొటోలో హాయిగా కింద కూర్చొని ట్యాబ్ ద్వారా రాసుకుంటున్న విద్యార్థిని పేరు సమీరా. బూదవాడ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అప్పట్లో కరోనా ద్వారా పాఠశాలలకు వెళ్లకుండానే ప్రైవేట్ పాఠశాలలు ఆన్‌లైన్ క్లాస్ పెట్టి ముందుండేవారు. కాని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మాత్రం దూరంగా ఉండేవారు. ఈపరిస్థితిని గమనించిన సీఎం జగన్ తన ఆలోచనతో సరికొత్త విప్లవం సృష్టించారు. ఎందుకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువుకోకూడదన్న ఆలోచనతో బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్ ఇచ్చి మరీ ప్రోత్సాహం ఇచ్చారు. భవిష్యత్‌లో పోటీ ప్రపంచంలో ప్రభుత్వ విద్యార్థులు ముందుండాలన్న సంకల్పంతో విద్యార్థులకు అందించాడు. ట్యాబ్ ద్వారా అర్థంకాని పాఠాలను మళ్లీ చదువుకొని అర్థం చేసుకుంటున్నాని సమీరా ఆనందం వ్యక్తం చేసింది.. కొత్త కొత్త టెక్నిక్‌లతో ట్యాబ్ ద్వారా బాగా అర్థం అవుతున్నాయని చిరునవ్వుతో చెప్పింది.



సమీరా



ట్యాబ్ ద్వారా పాఠాలు వింటున్న సమీరా

మౌలిక వసతులతో మంచి వాతావరణం..

ఈ ఫొటోలో జెండా పట్టుకుని చిరునవ్వుతో ఉన్న విద్యార్థిని పేరు గోగులమూడి అక్షయ. బూదవాడ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. గత ప్రభుత్వంలో మౌలిక వసతులు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడేవారు. కానీ నాడు–నేడు ద్వారా మాపాఠశాలలో మంచి బోధన జరుగుతోందని సంతోష్యం వ్యక్తం చేసింది. మిని వాటర్ ప్లాంట్, నూతనంగా నిర్మించిన టాయిలెట్స్, తరగతి గదులోని బల్లలు, డిజిట్ క్లాస్ రూములు అన్ని వసతులు చాలా బాగున్నాయని అంది. గతంలో టాయిలెట్స్‌కి వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడే వాళ్లమని, ప్రస్తుతం ఇప్పుడు ఆ పరిస్థితి లేదని తెలిపింది.



అక్షయ



రేణిగంగవరం పాఠశాలలో డిజిటల్ బోధన

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: నియోజకవర్గంలో ఐదుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అందించారు. నియోజకవర్గంలో కల్లగుంట అంజమ్మకు ఒక రూ.1.20 లక్షలు, కే.కోమలి రూ. 50 వేలు, కీర్తి సుబ్బారావు రూ.80 వేలు, ఎలిపురి లవేష్‌కు రూ.25 వేలు, పి.బాలశంకరరావుకు రూ.80 వేలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు కాగా చెక్కులను వారికి అందించారు.

వెయిట్ లిఫ్టర్ ప్రవీణ్‌కుమార్‌కు అభినందనలు



ప్రవీణ్‌కుమార్‌ను అభినందిస్తున్న డీఎస్పీ

చీరాల రూరల్: జాతీయ స్థాయి మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన చీరాల మండలం సాయికాలనీకి చెందిన దేవరకొండ ప్రవీణ్‌కుమార్‌ను డీఎస్పీ ఎస్ ప్రసాదరావు అభినందించారు. ఈనెల 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ప్రవీణ్ కుమార్ ఈ ఘనత సాధించారు. శుక్రవారం ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్రాంజ్ మెడల్ విజేత ప్రవీణ్‌కుమార్ ఇతర నాయకులతో కలిసి డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని మర్యాద పూర్వకంగా డీఎస్పీనిని కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రవీణ్ కుమార్‌ను అభినందించారు.

గడ్డివాములు దగ్ధం



కాలిపోతున్న వరిగడ్డి వాములు

అద్దంకి: ప్రమాదవశాత్తు వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఈఘటన మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. అందిన సమచారం మేరకు గ్రామానికి చెందిన అడుసుమల్లి మురళి, అడుసుమల్లి రాదయ్య, కమ్మ శ్రీనివాసరావు, కమ్మ వెంకటేశ్వర్లు, నర్రా శ్రీదేవి, గండు చిరంజీవి గ్రామానికి తూర్పు వైపున గుండ్లకమ్మకు వెళ్లే రహదారి పక్కన స్థలాల్లో వరుసగా పశువుల మేత కోసం వాములు వేసుకున్నారు. సుమారు 15 ఎకరాల్లో గడ్డిని పారు వాములుగా వేసుకోగా, శుక్రవారం మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా వాముల నుంచి మంటలు ఎగిసిపడటంతో అక్కడికి వెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. స్థానికుల సమాచారం మేరకు ఫైరింజన్ వచ్చేసరికి ఆరు వాములు దగ్ధమయ్యాయి. ఏడో వామిని అగ్నికి ఆహుతి కాకుండా కాపాడారు. కాలిపోయిన వాముల విలువ సుమారు 1.80 లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు. బహిర్భూమికి వచ్చి ఆకతాయిలు విసిరేసిన సిగరెట్టే ప్రమాదానికి కారణం అయి ఉండవచ్చని బాధితులు భావిస్తున్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

బల్లికురవ: ప్రభుత్వం ఉపాధి హమీ పథకంలో ఐదెకరాల్లోపు పొలం కలిగిన సన్న, చిన్నకారు రైతులకు నూరు శాతం సబ్సిడీపై ఉచితంగా పండ్ల మొక్కలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆ పథక ఏపీవో బాలకృష్ణ నాయక్ శుక్రవారం తెలిపారు. నిమ్మ, మామిడి, సపోట, బత్తాయి, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, తైవాన్ జామ, జామ, గులాబీ, మల్లె, సీతాఫలం, రేగు, దానిమ్మ, నేరేడు, మునగ సాగుకు ఎంపీడీవో, ఏపీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో వివరించారు.

యువకుడికి గాయాలు

జే.పంగులూరు: రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును బైక్‌ను ఢీకొట్టడంతో యువకుడికి గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని ముప్పవరం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. ముప్పవరం గ్రామానికి చెందిన కొమ్ము అశోక్‌బాబు తన బైక్‌పై ముప్పవరం సమీపంలో బైక్‌పై వెళ్తుండగా గ్రామ సమీపంలో రోడ్డు పక్క ఆగిఉన్న కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అశోక్ బాబు తలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

సోషల్ మీడియానే పార్టీకి బలం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కృష్ణమోహన్

- నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్

పర్చూరు (చినగంజాం): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సోషల్ మీడియా విస్తృతంగా పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం పర్చూరు ఆర్అండ్‌బీ బంగ్లా నందు పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఆమంచి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు తెలిసేలా సోషల్ మీడియాను బాగా వినియోగించాలన్నారు. టీడీపీ, ఎల్లో మీడియా సీఎం జగన్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. సమావేశానికి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌లు, కో కన్వీనర్‌లు, మండల స్థాయి కన్వీనర్‌లు, కో కన్వీనర్‌లు పాల్గొన్నారు.

వైవీని కలిసిన నియోజకవర్గ నాయకులు



టీటీడీ ఛైర్మన్ సుబ్బారెడ్డిని కలసిన నాయకులు

మేదరమెట్ల: తిరుమల తిరుపతి దేవస్థాన ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని అద్దంకి నియోజకవర్గంలోని పలు గ్రామాల నాయకులు తాడేపల్లిలోని వైవీ నివాసంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వైవీ వారిని అడిగి తెలుసుకున్నారు. వైవీని కలసిన వారిలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికం కోటిరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌ఛైర్మన్ కోయి అంకారావు, అద్దంకి పట్టణ పార్టీ నాయకుడు కాకాని రాధాకృష్ణమూర్తి, కొరిశపాడు మాజీ జెడ్పీటీసీ ముత్తవరపు రమణయ్య, మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు, స్వయంపు హనుమంతరావు, పోకూరి హనుమంతరావు తదితరులు ఉన్నారు.

దుగ్గిరాల సేవలు చిరస్మరణీయం

చీరాల అర్బన్: ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య 165వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీరాల–పేరాల పన్నుల నిరాకరణ ఉద్యమానికి నాంది పలికారన్నారు. బ్రిటిష్ వారిని గడగడలాడించి, రామదండు యువసేన అనే సేవా సంస్థను స్థాపించారన్నారు. విజయవాడలో ఏఐసీసీ మహాసభకు లక్షలాది ప్రజానీకం పాల్గొనగా రామదండు యువసేన వారికి సహకరించి సభను జయప్రదం చేశారన్నారు. అందుకు ఆనాడు మహాత్మాగాంధీ, ఇతర జాతీయ నాయకులు దుగ్గిరాల గోపాలకృష్ణయ్యను అభినందించారన్నారు. కార్యక్రమంలో సర్విశెట్టి సుబ్బరామయ్య, అన్నంరాజు సుబ్బారావు, తడవర్తి చంద్రశేఖర్, దోగుపర్తి సురేష్, పవని భానుచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.



గోపాలకృష్ణయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న హెచ్ఎం, తదితరులు

స్థానిక పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లోని గోపాలకృష్ణయ్య విగ్రహానికి హెచ్ఎం బి.సాల్మన్ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసరావు మల్లికార్జున, ప్రభాకరాచారి, మహిళా పోలీస్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

బల్లికురవ: ప్రజలు ఐక్యతతో కలిసి మెలసి జీవించాలని అప్పుడే అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతాయని సంతమాగులూరు సీఐ ప్రభాకర్ పిలుపునిచ్చారు. గ్రామ దర్శినిలో భాగంగా శుక్రవారం కొణిదెన గ్రామం ఎస్సీ, బీసీ కాలనీల్లో ప్రజలకు చట్టాలు, కేసులపై అవగాహన కల్పించారు. కక్షలు, కార్పణ్యాలకు పాల్పడితే కుటుంబాలు చిన్నాభిన్నంతో పాటు సమయంలో డబ్బు వృథా అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో బల్లికురవ ఎస్సై వీ. వేమన పాల్గొన్నారు.

హజ్ యాత్రకు తొమ్మిది మంది



శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం పెద్దలు

మార్టూరు: మండలంలోని వలపర్ల గ్రామం నుంచి పవిత్ర హజ్ యాత్రకు ఈనెల 7వ తేదీ తొమ్మిది మంది ముస్లింలు బయలుదేరి వెళ్తున్నారు. పఠాన్ అబ్దుల్ రవూఫ్ ఖాన్, షేక్ మాజీత్ అలీ, సయ్యద్ చిన కరిముల్లా, షేక్ ఇబ్రహీం తదితరులు వెళ్తుండగా జిల్లా వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి గడ్డం మస్తాన్ వలి వీరిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు షేక్ హాజీ అబ్దుల్ సలీం, రాష్ట్ర ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ కరిముల్లా, షేక్ అబ్దుల్ రహమాన్, షేక్ బాజీ, సయ్యద్ ఉస్మాన్, షేక్ జాన్‌బాషా, జమాత్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నిరుపేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న అనీల్‌కుమార్

చీరాల టౌన్: నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పద్మ భాస్కర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఘంటా అనీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని బుర్లవారిపాలెం పంచాయతీలోని కాలువ కట్టలపై నివశించే గిరిజన కుటుంబాల్లోని 195 మంది నిరుపేదలకు పద్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణ ప్రతి పౌరుడి బాధ్యత

జే.పంగులూరు: సమాజంలో జరిగే నేరాలు నియంత్రించేందుకు ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలని రేణింగవరం ఎస్సై తిరుపతిరావు అన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ముప్పవరం గ్రామాన్ని ఎస్సై తిరుపతిరావు శుక్రవారం విలేజ్ విజిటింగ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ సైబర్ నెరాలు, మాదక ద్రవ్యాల వనియోగంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామాన్ని పరిశీలించి ఎనిమిది ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.